క్లుప్తంగా

పక్కాగా రీసర్వే చేయాలి



లక్ష్మంపల్లిలో రీసర్వేను పరిశీలిస్తున్న డిప్యూటీ కలెక్టర్ తిప్పేనాయక్

శెట్టూరు: లక్ష్మంపల్లిలో జరుగుతున్న పైలెట్ ప్రాజెక్ట్ రీసర్వే పక్కాగా నిర్వహించాలని చేయాలని ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్ తిప్పేనాయక్ తెలిపారు. గురువారం లక్ష్మంపల్లిలో జరుగుతున్న రీసర్వే పనులను తహసీల్దార్ ఈశ్వరయ్య శెట్టితో కలిసి పరిశీలించారు. రీసర్వేకు రైతుల సహజురు, క్షేత్ర స్థాయిలో రైతులకు కలుగుతున్న ఇబ్బందులపై ఆయన ఆరా తీశారు. సర్వే వివరాలను రికార్డుల్లో పక్కాగా నమోదు చేయాలన్నారు. వీఆర్ఓ తిప్పేస్వామి, సర్వేయర్లు, రైతులు పాల్గొన్నారు.

పారదర్శకంగా రీసర్వే చేయాలి

కుందుర్పి: భూరికార్డుల సవరణ కోసం చేపడుతున్న భూసర్వేలు పారదర్శకంగా ఉండాలని ఆర్డీఓ వసంతబాబు తెలిపారు. గురువారం మండలంలోని కరిగానిపల్లి రెవెన్యూ గ్రామంలో చేపడుతున్న భూసర్వే పనులను ఆర్డీఓ పరిశీలించారు. రెవెన్యూ సిబ్బంది సర్వేలకు వెళ్లేముందు సంబంధిత రైతులకు సమాచారం ఇవ్వాలన్నారు. మూడుసార్లు సమాచారం ఇచ్చి సర్వేలను త్వరిత గతిన పూర్తి చేయాలన్నారు. రైతులు సైతం అధికారులకు సహకరించాలన్నారు. సర్వేల్లో తహసీల్దార్ శ్రీనివాసులు, రీసర్వే డీటీ గురుబ్రహ్మ, సర్వేయర్లు, వీఆర్ఓలు పాల్గొన్నారు.

'నాట్స్' శిక్షణను సద్వినియోగం చేసుకోండి



అవగాహన కల్పిస్తున్న మెప్మా అధికారులు

రాయదుర్గంటౌన్: 2021 తర్వాత నుంచి డిగ్రీ పూర్తయిన విద్యార్థులు కేంద్ర విద్యామంత్రిత్వశాఖ (నాట్స్) ఆధ్వర్యంలో అందించే శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని మెప్మా టీఎంసీ నారాయణరెడ్డి కోరారు. స్థానిక చౌడమ్మదేవి కమ్యూనిటీ సెంటర్‌లో ఆర్పీలతో సమావేశం నిర్వహించారు. ఇప్పటికే నాట్స్ పథకం కింద మెప్మా రిసోర్స్ పర్సన్లు 483 మందిని సర్వే ద్వారా గుర్తించినట్లు తెలిపారు. పట్టణంలోని పొదుపు సంఘాల సభ్యులు, వారి కుటుంబ సభ్యుల్లో 2012 తర్వాత డిగ్రీ పూర్తయిన వారికి ఆన్‌లైన్ నైపుణ్య శిక్షణతోపాటు ఏడాది పాటు స్టైఫండ్ పొందే అవకాశం ఉందన్నారు.

ఘనంగా మహిళా దినోత్సవం

కణేకల్లు: కణేకల్లులో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో గురువారం మహిళా దినోత్సవం ఘనంగా జరిగింది. ఐసీడీఎస్‌ప్రాజెక్ట్ కార్యాలయం నుంచి బస్టాండ్ వరకు అంగన్‌వాడీ వర్కర్లు, ఆయాలు ర్యాలీ చేశారు. అనంతరం బస్టాండ్ సర్కిల్ వద్ద మానవ హారంగా ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు రమాదేవీ, శాంతకుమారి, గీత, కణేకల్లు, బొమ్మనహాళ్ మండలాల్లోని అంగన్‌వాడీ వర్కర్లు, ఆయాలు పాల్గొన్నారు.

మున్సిపల్ విభాగం అధ్యక్షుడిగా దొడగట్ట మురళి

కళ్యాణదుర్గం: కళ్యాణదుర్గం అసెంబ్లీ నియోజకవర్గ మున్సిపల్ విభాగం అధ్యక్షుడిగా దొడగట్ట మురళిని నియమిస్తూ పార్టీ కేంద్ర కార్యాలయం గురువారం ఓ ప్రకటన విడుదల చేసింది. పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు నియమించినట్లు పార్టీ కార్యాలయం తెలిపింది. గతంలో పంపిన జాబితాలో గోపారం శ్రీనివాసులు పేరు రెండు సార్లు రావడంతో అప్పట్లోనే ప్రకటించాల్సిన పేరును సవరించి, పంపినట్లు పార్టీ సమన్వయకర్త డాక్టర్ తలారి రంగయ్య తెలిపారు. దొడగట్ట మురళి మాట్లాడుతూ తనపై నమ్మకంతో పదవిని కట్టబెట్టిన పార్టీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకట్రామిరెడ్డి, సమన్వయకర్త రంగయ్యలకు కృతజ్ఞతలు తెలియజేశారు.

వైభవంగా మల్లేశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవం



ఉండబండలో కేదార్ జగద్గురులను అడ్డపల్లకీలో ఊరేగిస్తున్న భక్తులు

విడపనకల్లు: ఉండబండలో భ్రమరాంభ సమేత మల్లేశ్వస్వామి నాల్గో వార్షికోత్సవం గురువారం వైభవంగా జరిగింది. ఉదయం నుంచి మల్లేశ్వర స్వామి ఆలయంలో పెద్ద ఎత్తున పూజలు నిర్వహించారు. శ్రీమద్ హిమవత్ కేదార వైరాగ్య సింహసనాధీశ్వర 1008 పదవీ భూషిత కేదార్ జగద్గురులను అడ్డ పల్లకీలో ఊరేగించారు. కార్యక్రమంలో కమ్మరచేడు పీఠాధిపతులు కల్యాణ స్వాములు, గవిమఠం జగళూరు మఠం నాల్వాడీ శాంతలింగ శివాచార్యులు స్వాములు, పాల్తూరు చెన్నవీర శివాచార్య స్వాముల, తాళికోట గురులింగ శివాచార్య స్వాములు, హత్తిగూడ శ్రీగిరి మల్లేశ్వర స్వాములు, బెంగళూరు జంబునాథ్ స్వాములు, కొక్కరచేడు చరణానంద గిరి మాతాజీ శంకరానాంద స్వాములు,సర్పంచు సర్వ మంగళం, గ్రామపెద్దలు ప్రకాష్‌గౌడు, రాజన్నగౌడు, బోయ భాస్కర్, ఓబుళప్పపాల్గొన్నారు.

వైద్యం దైన్యం



రూ.కోట్లు వెచ్చించారు.. ప్రారంభం మరిచారు

- పూర్తయిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రం భవన నిర్మాణం
- ఏడాది గడిచినా పట్టించుకోని అధికారులు
- సేవలు అందక రోగుల అవస్థలు



దర్గాహొన్నూరులో నిరుపయోగంగా మారిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

బొమ్మనహాళ్: గ్రామీణ ప్రాంత ప్రజలకు వైద్య సేవలు అందించాలన్న ఉద్దేశంలో రూ.కోట్లు వెచ్చించి నిర్మించిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రం భవనం ప్రారంభానికి నోచుకోలేదు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో దర్గాహొన్నూరులో రూ.1.50 కోట్లతో పీహెచ్‌సీని నిర్మించారు. భవన నిర్మాణానికి ముందు ఇద్దరు వైద్యులు, స్టాఫ్‌నర్సు, ల్యాబ్ టెక్నీషియన్, ఫార్మాసిస్టు, ఇతర సిబ్బందిని ప్రభుత్వం నియమించింది. అయితే కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత భవనాన్ని ప్రారంభించక, రోగులకు సేవలు అందక అవస్థలు పడుతున్నారు.

బొమ్మనహాళ్ మండలంలోని గోవిందవాడ, కల్లుదేవనహళ్లి, తారకాపురం, దర్గాహొన్నూరు, వన్నల్లి, హోసల్లి తదితర గ్రామాల్లో ప్రజలకు వైద్య సేవలు అందించేందుకు సరైన ఆస్పత్రి లేదు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత దర్గాహొన్నూరులో రూ.1.50 కోట్లు నిధులతో పీహెచ్‌సీని నిర్మించారు. 2024 ఎన్నికల ముందు ఆస్పత్రి నిర్మాణం పూర్తయ్యింది. కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత ఆస్పత్రి భవనం ప్రారంభానికి నోచుకోలేదు. ఆస్పత్రిలో పరికరాలు రాకపోవడంతో పీహెచ్‌సీ అలంకార ప్రాయంగా ఉంది. దీంతో గ్రామంలో విలేజ్ క్లినిక్‌లో వైద్య సేవలందిస్తున్నారు. కనీసం ఐదుగురు రోగులకు ఓపీ నిర్వహించడానికి కూడా స్థలం లేదు. రోజూ వంద మంది వరకు రోగులు వస్తుంటారు.

బెడ్లు లేవు.. విశ్రాంతి కరువు

రోగులు విశ్రాంతి తీసుకోవడానికి బెడ్లు కూడా లేవు. వన్నల్లి, దర్గాహొన్నూరు, గోవిందవాడ, తారకాపురం, హోసల్లి తదితర గ్రామాల ప్రజలు , గర్భిణులు కాన్పుల కోసం ఉరవకొండ, కర్ణాటకలోని రూపనగుడికి వెళ్లాల్సి వస్తోంది. రాత్రిళ్లు దర్గాహొన్నూరుకు అత్యవసర వాహనాలు రాకపోకడంతో అవస్థలు పడుతున్నారు. ప్రాథమిక ఆస్పత్రికి కావాల్సిన పడకలు, సామగ్రి నేటికీ రాలేదు. ఇప్పటికీ రాలేదు. దీంతో ఆస్పత్రి భవనం ప్రారంభానికి నోచుకోలేదని గ్రామస్తులు అంటున్నారు.

పీహెచ్‌సీని ప్రారంభించాలి



దర్గాహొన్నూరులో రూ.1.50 కోట్ల వ్యయంతో నిర్మించిన పీహెచ్‌సీ భవనం పూర్తయ్యింది. అనంతరం ఎన్నికలు రావడంతో ఆసపత్రికి కావాల్సిన బెడ్లు, సామగ్రి రాలేదు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం అధునాతన పరికరాలను తెచ్చి ఆస్పత్రిని ప్రారంభించాలి. సామాన్యులు ఉరవకొండ, కర్ణాటకలోని రూపనగుడి, బళ్లారికి వెళ్లాల్సి వస్తోంది.

– ఆర్.రామాంజనేయులు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బొమ్మనహాళ్

పట్టణాలకు పరుగులు తీస్తున్నాం



దర్గాహొన్నూరులో పీహెచ్‌సీ భవనం పూర్తయినా ప్రారంభించలేదు. విలేజ్ హెల్త్ క్లినిక్‌లో రోగులకు విశ్రాంతి తీసుకునేందుకు బెడ్లు లేవు. బళ్లారి, ఉరవకొండ పట్టణాలకు వెళ్లాల్సి వస్తోంది. అత్యవసర సేవలకు అవస్థలు పడుతున్నాం. ఆరోగ్య కేంద్రాన్ని వెంటనే ప్రారంభించాలి.

– కొనుకొండ్ల శ్రీదేవి, ఎంపీటీసీ–2 దర్గాహొన్నూరు గ్రామం

విలేజ్ క్లినిక్‌లో వైద్య సేవలు



దర్గాహొన్నూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నిర్మాణం పూర్తయింది. కానీ ఆస్పత్రిలో వైద్య సేవలు చేయడానికి పడకలు, వైద్య పరికరాలు ఇంకా రాలేదు. దీంతో ఆస్పత్రిని ప్రారంభించలేదు. ప్రస్తుతం విలేజ్ హెల్త్ క్లినిక్‌లోనే రోగులకు, గర్భిణులకు వైద్య సేవలు అందిస్తున్నాం. పీహెచ్‌సీని ప్రారంభించడానికి ఉన్నతాధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్లాం.

– సుల్తానా, మెడికల్ ఆఫీసర్–2, దర్గాహొన్నూరు గ్రామం, బొమ్మనహాళ్ మండలం

ఉద్యోగుల సమస్యలపై నిరంతర పోరాటం

- ఏపీ హెచ్ఏఎంఎస్ఏ జిల్లా ప్రధాన కార్యదర్శి వేణుగోపాల్



కేక్ కట్ చేస్తున్న డాక్టర్ సౌమ్యారెడ్డి

కూడేరు: ఏపీ హెల్త్ అడ్మినిస్ట్రేటివ్ మెడికల్ సర్వీస్ అసోసియేషన్ (ఏపీ హెచ్ఏఎంఎస్ఏ) ఆధ్వర్యంలో వైద్య ఆరోగ్య శాఖ ఉద్యోగుల సమస్యలపై నిరంతరం పోరాటం చేయనున్నట్లు అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి వేణుగోపాల్ తెలిపారు. గురువారం స్థానిక పీహెచ్‌సీలో ఏపీ హెచ్ఏఎంఎస్ఏ రెండో వార్షికోత్సవం నిర్వహించారు. డాక్టర్ సౌమ్యా రెడ్డి కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి మాట్లాడారు. మెడికల్ ఉద్యోగుల పదోన్నతులు, ఇతర సమస్యల పరిష్కారానికి ప్రభుత్వంతో పోరాడనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఉరవకొండ తాలుకా ఉపాధ్యక్షుడు శ్రీనివాసులు, మహిళా కార్యదర్శి సుశీల, నాయకులు యశోద, చంద్రకళ, శివప్రసాద్, పీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడి



పాలవాయి వద్ద మామిడి రైతులకు సూచనలిస్తున్న ఉద్యాన అధికారి కృష్ణతేజ

కళ్యాణదుర్గం: మామిడిలో యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడి సాధించొచ్చని ఉద్యాన అధికారి కృష్ణతేజ చెప్పారు. గురువారం ఆయన పాలవాయి గ్రామంలో మామిడి పంటను సందర్శించారు. మామిడి రైతులు చేపట్టాల్సిన యాజమాన్య పద్ధతులు, జాగ్రత్తలను తెలియజేశారు. మామిడిలో బోరాన్ లోపం వల్ల పూత బాగా వచ్చి ఫలదీకరణ సరిగా రాకపోవడం వల్ల పిందె కట్టు సరిగా ఉండదన్నారు. ఇలాంటి సమయంలో బోరాన్ లోపాన్ని సవరించడానికి, పిందె కట్టు పెంచడానికి పూ మొగ్గలు బైటకు రాక ముందు బోరాక్స్ పౌడర్ 2 గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలన్నారు. కొత్త చిగురు వచ్చేటప్పుడు పూ మొగ్గలు పెరుగు దశలో ఉన్నప్పుడు 1.5 -2 గ్రాముల జింక్ సల్ఫేట్, 1.25 గ్రాముల బోరాన్ 20 శాతం లీటరు నీటికి కలిపి చెట్లు బాగా తడిచేటట్లు పిచికారీ చేయాలన్నారు. తేనెమంచు పురుగు, తామర పురుగు నివారణకు మామిడి చెట్టు పూ మొగ్గ దశలో ఉన్నప్పుడు 0.3 మి.లీ ఇమిడాక్లోప్రిడ్ లేదా 1.5 గ్రాముల ఎసీఫేట్, 1. మి.లీ డైఫెనకొనాజోల్ లేదా 2.5 గ్రాముల మ్యాంకోజెబ్ లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలన్నారు. పచ్చిపూత దశలో బూడిద తెగులు నివారణకు నీటిలో కరిగే గంధకం 3 గ్రాములు లేక ట్రిడిమర్ఫ్ లేదా డైనోకాప్ 1 మి.లీ లేదా హెక్సకొనోజోల్ 2 మి.లీ లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలన్నారు.

'నాపైనే ఎదురు ఫిర్యాదు చేశారు'



ఎంపీటీసీ అరుణ్‌కుమార్‌ను అదుపులోకి తీసుకుంటున్న పోలీసులు

రాయదుర్గం: ప్రజా ప్రతినిధిని అన్న కనీస గౌరవం లేకుండా దుర్భాషలాడి నాపైనే అక్రమంగా ఫిర్యాదులు చేయడం సరికాదని వడ్రహొన్నూరు ఎంపీటీసీ అరుణ్‌కుమార్ వాపోయారు. గురువారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ ఎం. కొండన్నను కలిసి..గ్రామ సచివాలయంలో ఆరు నెలల నుంచి కంప్యూటర్లు పని చేయలేదని, వాటిని మరమ్మతు చేయించి వినియోగంలోకి తీసుకురావాలని కోరడమే తాను చేసిన తప్పా అని అరుణ్‌కుమార్ ప్రశ్నించారు. సమస్య తెలియజేస్తున్నా ఎంపీడీఓ సరిగా స్పందించకపోవడం బాధేసిందన్నారు.' సార్.. మీ తీరేమి బాగోలేదన్నందుకే తనపై తిరగబడి ప్రతికల్లో రాయలేనంతగా దుర్భాషలాడుతూ యూజ్‌లెస్ ఫెలో.. ఆఫీస్ నుంచి బయటకు వెళ్లు' అంటూ దూషించారని అన్నారు. గత సర్వసభ్య సమావేశంలో నిధుల విషయం పై గట్టిగా నిలదీసినందుకు మనసులో పెట్టుకొని తప్పుడు ఫిర్యాదు చేశారని వాపోయారు. అధికారుల పట్ల తాను ఎప్పుడూ గౌరవంగా మెలుగుతానని గుర్తు చేశారు. వాస్తవాలు తెలుసుకోకుండా కొందరు అత్యుత్సాహం ప్రదర్శిస్తూ వీడియోలను వైరల్ చేశారని తప్పుపట్టారు. ఎంపీడీఓ తాను దుర్భాషలాడినట్టు, బెదిరించినట్టు వచ్చిన వార్తలను ఆయన ఖండించారు.

చుట్టుముట్టిన పోలీసులు

ఎంపీడీఓ రాతపూర్వకంగా ఫిర్యాదు చేయకనే కేవలం ఫోన్‌లో విషయం తెలుసుకున్న పోలీసులు ఆగమేఘాలపై వాలిపోయారు. స్థానిక ఆర్అండ్‌బీ అతిథి గృహం వద్ద నిల్చున్న ఎంపీటీసీని ఎస్ఐ బలరాజు ఆధ్వర్యంలో పోలీసులు చుట్టుముట్టి అదుపులోకి తీసుకున్నారు. జీపు ఎక్కాలంటూ బలవంతం చేశారు. ఎందుకు సార్ అలా ప్రవరిస్తున్నారని, స్వయానే తానే పోలీస్‌స్టేషన్‌కు వస్తానని చెప్పి వారి వెంటే ద్విచక్ర వాహనంపై చేరుకున్నారు. అనంతరం నాటకీయ పరిణామం మధ్య సిబ్బందితో కలసి పోలీస్‌స్టేషన్ వద్దకు చేరుకున్న ఎంపీడీఓకు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ రాయంపల్లి రామాంజనేయులు, కేపీదొడ్డి సర్పంచ్ ఎన్. రమేష్, ఎస్సీసెల్ రాష్ట్ర కార్యదర్శి గోవిందు తదితరులు ప్రాధేయపడ్డారు. తీరు మార్చుకోని ఎంపీడీఓ ఫిర్యాదు చేసి వెళ్లిపోయారు. అక్కడితో ఆగకుండా విధులు బహిష్కరిస్తూ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేశారు.

ఎంపీడీఓపై ఫిర్యాదు..

వడ్రహొన్నూరు ఎంపీటీసీ అరుణ్‌కుమార్‌పై ఎంపీడీఓ ఎం.కొండన్న నోరు పారేసుకోవడం దుర్మార్గమని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ రాయంపల్లి రామాంజనేయులు, కేపీదొడ్డి సర్పంచ్ ఎన్.రమేష్, ఎస్సీసెల్ రాష్ట్ర కార్యదర్శి బీటీపీ గోవిందు ఖండించారు. మండలంలోని పలు గ్రామాలకు చెందిన ఎంపీటీసీలు, సర్పంచులు, వైఎస్సార్‌సీపీ నాయకులతో కలిసి వెళ్లి అర్బన్ పీఎస్‌లో ఎంపీడీఓ పై ఫిర్యాదు చేశారు. ప్రజాప్రతినిధికి గౌరవం లేకుండా మాట్లాడిన ఎంపీడీఓపై చర్యలు తీసుకోవాలని పోలీసులను కోరారు. ఎంపీటీసీకి న్యాయం చేయకపోతే స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఎదుట పార్టీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేస్తామని తెలిపారు.

మాజీ సీఎంను కలిసిన బోయ తిప్పేస్వామి



మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని కలిసిన రాష్ట్ర కార్యదర్శి తిప్పేస్వామి

కళ్యాణదుర్గం రూరల్: మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని తాడేపల్లిలోని పార్టీ కార్యాలయంలో రాష్ట్ర కార్యదర్శి బోయ తిప్పేస్వామి గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. కళ్యాణదుర్గం నియోజకవర్గం రాజకీయ పరిస్థితులను జగన్ అడిగి తెలుసుకున్నారు. పార్టీ బలోపేతానికి సమష్టిగా పనిచే యాలని మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సూచించారు.

పార్టీ బలోపేతానికి కృషి చేయండి



వైఎస్ జగన్‌ను కలిసిన మహిళా అధ్యక్షురాలు ఉషారాణి, నాయకుడు జయరామిరెడ్డి

రాయదుర్గం: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని సంస్థాగతంగా మరింత బలోపేతం చేసేందుకు ప్రతి ఒక్కరూ పాటుపడాలని వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి దిశానిర్దేశం చేశారు. గురువారం విజయవాడలో నియోజకవర్గ మహిళా విభాగం అధ్యక్షురాలు కోకుర్తి ఉషారాణి, సీనియర్ నాయకుడు కోకుర్తి జయరామిరెడ్డి మాజీ సీఎంను కలిశారు. అనంతరం పార్టీ పరిశీలకుడు సజ్జల రామకృష్ణారెడ్డిని కలిసి సన్మానించారు.

ఏపీజీబీ కార్యాలయం తరలింపు సరికాదు

కళ్యాణదుర్గం రూరల్: ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంక్ ప్రధాన కార్యాలయం కడపలోనే కొనసాగించాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. గురువారం పట్టణంలోని ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు వద్ద సీఐటీయూ నాయకులు, రాయలసీయ అభివృద్ధి వేదిక ఆధ్వర్యంలో నిరసన తెలియజేశారు. సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి అచ్యుత్ ప్రసాద్ మాట్లాడుతూ ఏపీజీబీ ప్రధాన కార్యాలయం కడప నుంచి అమరావతి తరలించాలని చూస్తే కార్మిక సంఘాలు, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. సీఐటీయూ నాయకులు. అంగన్‌వాడీ యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

వాల్మీకి విగ్రహ ప్రతిష్ట

రాయదుర్గంటౌన్: పట్టణంలోని కోట మారెమ్మగుడి వద్దనున్న వాల్మీకి కల్యాణ మంటపంలో వాల్మీకి విగ్రహాన్ని గురువారం ప్రతిష్టించారు. కల్యాణమంటపం ఆవరణలో వాల్మీకి సంక్షేమ సేవా సమితి అధ్యక్షుడు బండి కిష్టప్ప ఆధ్వర్యంలో వేదపండితుల మంత్రోచ్ఛారణలతో విగ్రహాన్ని ప్రతిష్టించారు. సంక్షేమ సంఘం ప్రతినిధులు మలకన్న, నారాయణస్వామి, తోట రఘు, సంజీవ, టైలర్ రఘు, తిప్పేస్వామి, రవిచంద్ర, తిప్పయ్య, సిద్ధలింగప్ప, ముత్తయ్య, రాముడు, అంజి, రామాంజనేయులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ కార్యకర్తకు నివాళి

బ్రహ్మసముద్రం: మండలంలోని పోలేపల్లికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త, మాజీ స్కూల్ కమిటీ చైర్మన్ లింగన్న అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న మండల కన్వీనర్ పాలబండ్ల చంద్రశేఖర్‌రెడ్డి గురువారం లింగన్న మృతదేహానికి పూలమాలవేసి, నివాళులర్పించారు. సర్పంచ్ శెట్టిగారి మంజునాథ్, మాజీ ఎంపీటీసీ లోకేష్, ఉపసర్పంచ్ చిన్న నీలప్ప, మాజీ సింగిల్ విండో డైరెక్టర్ లింగన్న, నాయకులు జయరాం, మహాత్మ రెడ్డి, వసంత్, సుమిత్రపాల్, శివలింగ, బద్రి, మల్లేష్ పాల్గొన్నారు.

మున్సిపల్ పన్నులు చెల్లించండి

కళ్యాణదుర్గం: కళ్యాణదుర్గం మున్సిపాలిటీ పరిధిలోని ఇంటి, నీటి పన్నులు, ఖాళీ స్థలం పన్ను, ట్రేడ్ లైసెన్సు తదితర పన్నులను వెంటనే చెల్లించాలని మున్సిపల్ కమిషనర్ వంశీ కృష్ణ భార్గవ్ తెలిపారు. ఈ మేరకు గురువారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. 2024-25 ఆర్థిక సంవత్సరం 31-05-2025న ముగుస్తుందన్నారు. అప్పటి లోపు పన్నులు చెల్లించాలని తెలియజేశారు. రెండో శనివారం, ఆదివారం రోజు కూడా మున్సిపల్ కార్యాలయంలో పన్ను చెల్లించేందుకు ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. ప్రజలు పన్నులు చెల్లించి మున్సిపాలిటీ అభివృద్ధికి సహకరించాలని ఆయన కోరారు.

కర్ణాటక మద్యం పట్టివేత

గుమ్మఘట్ట: కోనాపురం క్రాస్ వద్ద 59 కర్ణాటక మద్యం ప్యాకెట్లను పట్టుకున్నట్లు ఎస్ఐ ఈశ్వరయ్య గురువారం తెలిపారు. గ్రామానికి చెందిన రామాంజనేయులు కర్ణాటక నుంచి మద్యం తెస్తుండగా పట్టుకున్నట్లు తెలిపారు.

నేడు ఉచిత కంటి వైద్య శిబిరం

కణేకల్లు: కణేకల్లులోని చిక్కణ్ణేశ్వరస్వామి కల్యాణ మంటపంలో లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో శుక్రవారం ఉదయం 8 గంటలకు కంటి వైద్య శిబిరం ప్రారంభమవుతుందని లయన్స్‌క్లబ్ మండల అధ్యక్షులు వేలూరు మరియప్ప, ఉపాధ్యక్షుడు చంద్రశేఖర్ గుప్తా, కార్యదర్శి చాంద్‌బాషా ఓ ప్రకటనలో తెలిపారు. బెంగళూరులోని శంకర కంటి ఆసుపత్రి కంటి వైద్యులు పరీక్షలు చేస్తారన్నారు.

హిందూ రుద్రభూమి అభివృద్ధికి సహకరించాలి

రాయదుర్గంటౌన్: పట్టణంలోని శాంతినగర్‌లోని హిందూ రుద్రభూమి అభివృద్ధికి సహకరించాలని కమిటీ సభ్యులు మున్సిపల్ చైర్‌పర్సన్ పొరాళ్ల శిల్పకు గురువారం వినతిపత్రం అందించారు. రుద్రభూమి అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు చుంచుల నాగప్ప, కమిటీ సభ్యులు పొరాళ్ల గోవిందరాజులు, పొరాళ్ల ధనార్జున, భీమనపల్లి దివాకర్, పొరాళ్ల శివకుమార్ చైర్‌పర్సన్‌ను కలసి సమస్యలను వివరించారు.

20లోపు రైతులు రెన్యూవల్ చేసుకోవాలి

బొమ్మనహాళ్: శ్రీధరఘట్ట పీఏసీఎస్‌లో తీసుకున్న రుణాలను ఈనెల 20లోపు రెన్యూవల్ చేసు కోవాలని సీఈఓ నాగరాజు గురువారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ స్వల్ప కాలిక, దీర్ఘకాలిక రుణాలను చెల్లించాలన్నారు.

చికిత్స పొందుతూ యరగుంట వాసి మృతి

రాప్తాడురూరల్: ప్రమాదవశాత్తూ తీవ్రంగా గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న కణేకల్లు మండలం యరగుంట గ్రామానికి చెందిన వడ్డే తిమ్మయ్య (54) గురువారం మృతి చెందాడు. రూరల్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. వడ్డే తిమ్మయ్య ప్రస్తుతం నందమూరి నగర్‌లో నివాసం ఉంటున్నాడు. బళ్లారి రోడ్డు ఎంవైఆర్ ఫంక్షన్ హాల్ సమీపంలోని నిర్మాణంలో ఉన్న బిల్డింగ్ వద్ద వాచ్‌మెన్‌గా ఉంటున్నాడు. బుధవారం రెండో అంతస్తులో క్యూరింగ్ కోసం నీళ్ల పడుతుండగా ప్రమాదవశాత్తూ జారి కిందకు పడ్డాడు. తీవ్రంగా గాయపడ్డ తిమ్మయ్యను సర్వజన ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందాడు.

సంక్షిప్త సమాచారం

బాలికా విద్యను ప్రోత్సహించాలి

బొమ్మనహాళ్: సమాజంలోని ప్రతి ఒక్కరూ బాలికా విద్యను ప్రోత్సహించాలని డీడీఓ డాక్టర్ శ్రావణ్‌కుమార్ అన్నారు. గురువారం మండలంలోని ఉద్దేహాళ్ హైస్కూల్‌లో బాల్య వివాహాల వల్ల జరిగే అనర్థాలపై విద్యార్థినులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ విజయభారతి, సూపర్‌వైజర్ యుగంధర్, ఏఎస్ఎంలు శశికల, రమాదేవి, నాగేవేణీ, ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గవిమఠం పీఠాధిపతులకు సన్మానం



గవిమఠం పీఠాధిపతులు జగద్గురు చెన్నబసవ రాజేంద్ర స్వామిని సన్మానిస్తున్న దృశ్యం

ఉరవకొండ: ప్రసిద్ధి చెందిన గవిమఠం 8వ పీఠాధిపతులు జగద్గురు చెన్నబసవరాజేంద్రస్వామి, ఉత్తరాధికారి డాక్టర్ కరిబసవరాజేంద్రస్వామిని ప్రముఖ ఉరగాద్రి చౌడేశ్వరిదేవి ఆలయ ట్రస్టీ చైర్మన్ కొత్తశరత్, కమిటీ సభ్యులు గురువారం సన్మానించారు. చౌడేశ్వరి అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. గవిమఠం పీఠాధిపతులు వారు ఉరగాద్రి ఆలయ చైర్మన్ కొత్త శరత్‌ను అభినందించి, అమ్మవారి ఆలయాన్ని మరింత అభివృద్ధి చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్‌సీ ప్రసాద్, లక్కా ఎర్రిస్వామి, ఉట్టి ధనంజయ, బుద్ధిరాజశేఖర్ పాల్గొన్నారు.

సర్వేలు పక్కాగా చేయండి

కూడేరు: ప్రభుత్వం నిర్దేశించిన సమయానికి వర్క్ ఫ్రం హోం, పీ4, ఎంఎస్ఎం, చిన్న పిల్లల విత్ అవుట్ ఆధార్ సర్వేలను పక్కాగా చేపట్టి పూర్తి చేయాలని ఎంపీడీఓ కుళ్లాయిస్వామి సచివాలయ సిబ్బందికి ఆదేశించారు. గురువారం ఆయన కమ్మూరులోని సచివాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. సిబ్బందికి సంబంధించి హాజరు పట్టికను, సర్వేలకు సంబంధించిన ప్రోగ్రస్‌ను పరిశీలించారు.

స్టడీ మెటీరియల్ పంపిణీ

బెళుగుప్ప: కాలువపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులు పదో తరగతి విద్యార్థులకు స్టడీమెటీరియల్‌ను గురువారం పంపిణీ చేశారు. స్టడీమెటీరియల్ దాత పాతిరెడ్డి, చంద్రశేఖర్, రామాంజనేయులు, సతీస్, నాగరాజు, రామకృష్ణ, హెచ్ఎం కిష్టప్ప, ఉపాధ్యాయులు శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పెరటి కోళ్ల పంపిణీ

బెళుగుప్ప: మండల కేంద్రంలోని రవితేజ మండల సమాఖ్య కార్యాలయంలో పలు గ్రామాల మహిళా సంఘాల సభ్యులకు పెరటి కోళ్లు గురువారం పంపిణీ చేశారు. పశు సంవర్ధక శాఖ, డీఆర్‌డీఏ సెర్ప్, ఎస్టీ కార్పొరేషన్ కింద పెరటి కోళ్ల యూనిట్లు రూ.2,400 చొప్పున అందించారు. మండలంలో మొత్తం 27 యూనిట్లు పంపిణీ చేశామని ఏపీఎం సురేఖ తెలిపారు. పశుసంవర్ధక అధికారులు ఉపేంద్ర, జీపీ వెంకటస్వామి, స్థానిక వైద్యాధికారి రమేష్, వెలుగు సీసీలు పాల్గొన్నారు.

చిన్నారిని చితకబాదారని ఫిర్యాదు

ఉరవకొండ: వజ్రకరూరులోని 3వ అంగన్‌వాడీ కేంద్రంలో జి.హేమవర్షిని అనే చిన్నారిని అంగన్‌వాడీ కార్యకర్త సునీత చితక బాదినట్లు చిన్నారి తల్లిదండ్రులు రేణుక,శివ సీడీపీఓకు గురువారం ఫిర్యాదు చేశారు. చితకబాదడంతో వీపుపై వాతలు పడినట్లు ఫిర్యాదులో తెలిపారు.

కామక్కపల్లి వద్ద అగ్ని ప్రమాదం

కళ్యాణదుర్గం: కామక్కపల్లిలో రైతు మల్లికార్జున పొలంలో గురువారం విద్యుత్ షార్ట్ సర్క్యూట్ జరిగింది. దీంతో పొలంలో టమాటా పంటకు ఊతంగా వినియోగించిన కట్టెల కుప్పలు కాలిపోయాయి. దీంతో సుమారు రైతుకు రూ.లక్ష నష్టం వాటిల్లింది.

గడ్డివాములు దగ్ధం

బొమ్మనహాళ్: లింగదహాళ్‌కు చెందిన గంగన్న కొడుకు హనుమంతు కల్లంలో రెండు గడ్డివాములు గురువారం కాలి పోయాయి. రూ. 85 వేలు నష్టపోయినట్లు బాధితుడు తెలిపాడు.

విడపనకల్లు: మండలంలోని పాల్తూరు గ్రామంలో గడ్డివామి దగ్ధమైంది. గ్రామానికి చెందిన అంగడి రమేష్‌కు చెందిన గడ్డివామికి గుర్తు తెలియని వ్యక్తులు నిప్పుపెట్టారు. వరి గడ్డి, జొన్న సొప్ప వామి కాలిపోయిందని బాధితుడు ఆవేదన వ్యక్తం చేశాడు. రూ.3 లక్షలు నష్టపోయినట్లు బాధితుడు తెలిపాడు.

ఎన్ఎంఎంఎస్ పరీక్షలో విద్యార్థుల ప్రతిభ

ఉరవకొండ: ఎన్ఎంఎంఎస్ అర్హత పరీక్షల్లో ఉరవకొండ ఎస్కే ప్రభుత్వ ఉన్నత పాఠశాల, జెడ్పీసెంట్రల్ ఉన్నత పాఠశాలల విద్యార్థులు అద్భుత ప్రతిభ చూసి కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసే స్కాలర్ షిప్‌కు అర్హత సాధించారు. స్థానిక ప్రభుత్వ జెడ్పీ సెంట్రల్ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదివే విష్ణుష్, అక్షయ్‌లు ఎంపికయినట్లు నిస్వార్థ ఫౌండేషన్ అధ్యక్షుడు వెంకట్ తాడికొండ, హెచ్ఎం రాజేశ్వరీ తెలిపారు. ఎస్కే ప్రభుత్వ ఉన్నత పాఠశాల 8వ తరగతి అక్షయ్, రాగవర్షిణి ప్రతిభ చూపి విజయం సాధించినట్లు హెచ్ఎం వీరన్న తెలిపారు.

బెళుగుప్ప: మండలంలోని వివిధ పాఠశాలల నుంచి 9 మంది విద్యార్థులు ఎన్ఎంఎంఎస్ పరీక్షలో అర్హత సాధించినట్లు ఎంఈఓ మల్లారెడ్డి గురువారం తెలిపారు. హనిమిరెడ్డిపల్లి పాఠశాల నుంచి వై. శైలు, కోనంపల్లి పాఠశాల నుంచి పి. మన్విత, శ్రీరంగాపురం పాఠశాల నుంచి ఎం.శ్రీకాంత్, ఎం.దేవిప్రసాద్, విరుపాపల్లి పాఠశాల నుంచి జీ.బేబి, బెళుగుప్ప ఉన్నత పాఠశాల నుంచి వై.ఉషశ్రీ, దుద్దేకుంట ఉన్నత పాఠశాల నుంచి బి.నిఖిల్, గంగవరం ఉన్నత పాఠశాల నుంచి చైత్ర, నరసాపురం పాఠశాల నుంచి ఎం.గంగరాజు ఎంపికయ్యారు.

రైతుపై విద్యుత్ అధికారులు కక్ష సాధింపు

కళ్యాణదుర్గం రూరల్: పట్టణానికి చెందిన రైతు ప్రభాకర్ వ్యవసాయ తోటకు అధికారులు విద్యుత్ సరఫరా నిలిపివేశారు. రైతు ప్రభాకర్ ఉప్పొంక గ్రామం వద్ద రెండు ఎకరాల్లో టమాట పంట సాగు చేశాడు. తన పొలానికి ప్రత్యేక ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసుకున్నాడు. అయితే పొరుగున ఉన్న వ్యవసాయ తోటలకు కనెక్షన్ ఇవ్వాలని ప్రభాకర్‌కు విద్యుత్ అధికారులు సూచించారు. అందుకు ప్రభాకర్ నిరాకరించడంతో వ్యవసాయ తోటకు విద్యుత్ సరఫరా నిలిపివేశారు. దీంతో తన తోట ఎండిపోతోందని కుటుంబ సభ్యులతో కలిసి విద్యుత్ కార్యాలయం వద్ద నిరసన తెలియజేశాడు. ఉన్నతాధికారులు తనకు న్యాయం చేయాలని రైతు ప్రభాకర్ కోరాడు.

నాసిరకం విత్తనాలతో దెబ్బతిన్న పంట

కూడేరు: అనంతపురంలోని అమరావతి కంపెనీకి చెందిన నాసిరకం కళింగర విత్తనాలతోనే నష్టపోయినట్లు మరుట్ల-1 కాలనీకి చెందిన రైతు వెంకటేశులు నష్టపోయాడు. గురువారం బాధిత రైతు వెంకటేశు అధికారుల దృష్టికి తీసుకెళ్లాడు. మరుట్ల రైతు సేవా కేంద్రం విలేజ్ అగ్రి అసిస్టెంట్ (వీఏఏ) నారాయణమ్మ దెబ్బతిన్న పంటను పరిశీలించారు. జనవరి 1న అమరావతి కంపెనీ వాళ్ల వద్ద మ్యాక్స్ ప్లస్-84 రకం కళింగర విత్తనాలు కేజీ రూ.25 వేలు చొప్పున కేజీన్నర విత్తనాలను కొనుగోలు చేసినట్లు తెలిపాడు. 60 రోజులకు కోత దశకు రావాలన్నారు. నాసిరకం విత్తనాలతోనే నష్టపోయినట్లు రైతు వెంకటేష్ వాపోయాడు. వీఏఏ నారాయణమ్మ పంటను పరిశీలించారు.